

అన్నవరంలో రేపు తెప్పోత్సవం.. 5న గిరి ప్రదక్షిణ
7



ర్యాలీ చేస్తున్న ఏసీబీ అధికారులు

లంచం అడిగితే.. మాకు ఫోన్ చేయండి

ఏసీబీ డీఎస్పీ కిశోర్ కుమార్

రాజమహేంద్రవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వోద్యోగులు లంచం అడిగితే వెంటనే తమకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని..ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం ఉన్నా తమకు తెలియజేసి అవినీతి రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని ఏసీబీ డీఎస్పీ కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఏసీబీ శాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు.అవినీతిపై టోల్‌ఫ్రీ నెంబరు 1064 లేదా 9440446160/61/63 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ డి.వాసుకృష్ణ, వై.సతీశ్,ఎస్ఐ విల్సన్‌బాబు పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం (నేడు) ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. జిల్లాలో 2,35,031 మందికి రూ.103.17 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఏవైనా ఇబ్బంది ఏర్పడితే ఆందోళన చెందకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. పింఛన్లు పంపిణీకి 4975 మందిని నియమించామని చెప్పారు.

చివరికి.. దళారీ!



రాజానగరం సమీపంలో ఆరబెట్టకుండానే ధాన్యం అమ్మకాలు

75 కేజీల బస్తా రూ.1300

- అన్నదాతను ముంచిన తుఫాన్
- ముందస్తుగా ధాన్యం కోతలు
- పచ్చిమీదే సాగుతున్న లావాదేవీలు
- బస్తాకు రూ.400 దళారీ నొక్కుడు
- లబోదిబోమంటూ అమ్మకాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
ధాన్యం కొనుగోళ్లలో దళారీలు దగా చేస్తున్నారు. అన్నదాతలను నిలువునా దోచేస్తున్నారు. మొంథా తుఫాన్ దెబ్బకు విలవిల్లాడుతున్న రైతాంగాన్ని మరింత ముంచుతున్నారు. పచ్చి ధాన్యం పేరిట 75 కేజీల బస్తా ధాన్యాన్ని కేవలం రూ.1300లకే కొనుగోలు చేయడం గమనార్హం. వాస్తవానికి 75 కేజీల బస్తా రూ.1700 వరకూ కొనుగోలు చేయాలి. కానీ తడిచిందని.. పచ్చిగా ఉందనే కారణంతో దోచేస్తున్నారు. తీవ్రంగా నష్టపోయిన రైతాంగం దిక్కుతోచని స్థితిలో ధాన్యం అమ్ముకుంటూ కన్నీళ్లు పెడుతున్నారు. నరేంద్రపురం గ్రామానికి చెందిన గొర్లె ముసలయ్య, పాండవులు,బొర్రా చిన వీర్రాజు మాట్లాడుతూ సుమారు 35 ఎకరాల వరకూ కౌలు సాగు చేస్తున్నాం. ఇవాళ మొత్తం పంట పడిపోయింది..కోయడానికి కూడా వీలు లేకుండా పోయిందని వాపోయారు. బ్రోకర్లు పచ్చిధాన్యం అయినకాడకు కొంటున్నారని చెప్పారు. ఇక రాజానగరం,కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో వేల ఎకరాల పంట నీటిలో ఉంది. చాలా వరకూ పడిపోయింది. జిల్లాలో 76,941 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేసిన సంగతి తెలిసిందే.ఈ నెల 27వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ఆరంభ మయ్యాయి. కానీ తుఫాన్ దెబ్బతో రైతు సేవా కేంద్రాల సిబ్బంది అంతా పంటల నష్టం అం చనాలో నిమగ్నమయ్యారు.సందట్లో సడేమియా అన్నట్టు ధాన్యం కొనుగోలు బ్రోకర్లు ముందుకు వచ్చి పచ్చిధాన్యం అయినకాడకు కొంటున్నారు.



ధాన్యం కోతలు

75 కేజీల బస్తా రూ.1720

గ్రేడ్ ఎ.రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1720 వరకూ కొనుగోలు చేయాలి. ప్రస్తుతం గ్రేడ్-ఎ సన్నరకం ధాన్యం కూడా రూ.1300లకే కొనడం గమనార్హం. నరేంద్రపురం రోడ్డు సమీపంలో ఓ మిల్లు వద్ద రోడ్డు మీద ఓ రైతు, తడిచిన ధాన్యం, పచ్చిధాన్యం వేర్వేరుగా పోగు చేసి కొనేవారికోసం ఎదురు చూడడం గమనార్హం..ఇప్పటి వరకూ 2651.72 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి.శుక్రవారం తెరపి వ్వడంతో చాలా మంది కోతలకు ఉపక్రమించారు.

75 కేజీల బస్తా రూ.1300లకే అమ్ముకుంటున్నా..

వెలుగుబంద రోడ్డులో 9 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. కౌలు రూ.2 లక్షలు, పెట్టుబడి రూ.2 లక్షలు పెట్టా. తుఫాన్, భారీ వానల దెబ్బకు దిగుబడి ఎకరా 25 బస్తాలు వస్తుంది. ధాన్యం కొనేవాడులేక కేవలం 75 కేజీల బస్తా రూ.1300లకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఆరబోసుకునే పరిస్థితిలేక పచ్చి ధాన్యం అమ్మేశా. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.
- ఇండిగల రాంబాబు, కౌలు రైతు



పచ్చిమీదే కోత కోసిన ధాన్యం



ర్యాలీ చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్, పోలీసులు.. కలెక్టరేట్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ, డీఆర్వో

ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్

150వ జయంతి కార్యక్రమంలో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం/రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు పాటుబడిన ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ నర సింహ కిశోర్ కొనియాడారు. మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్ల భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా పోలీసులు 'రన్ ఫర్ యూనిటీ' పేరుతో ర్యాలీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ కిశోర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. లాలాచెరువు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన సిబ్బందితో ఎస్పీ ఐక్యత ప్రమాణం చేయించారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దూరదృష్టి, దేశభక్తి, దేశసేవపై స్ఫూర్తిని నిం పారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

సర్దార్ వల్లభబాయ్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీక అని..ఆయన దూరదృష్టి, ధైర్యం పట్టుదలతో 565 సంస్థానాలు భారత సయాఖ్యలో విలీనం చేసి దేశ సమగ్రతకు పునాదులు వేశారని జేసీ వై.మేఘస్వరూప్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.భారత దేశ తొలి ఉప ప్రధాని, స్వతంత్ర్య ఉద్యమనాయకుడు, గణతంత్ర సభ్యుల్లో ఒకరన్నారు. ఈ కార్యక్ర మంలో డీఆర్వో సీతారామమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు | మాజీ ఎంపీ భరత్‌పై పోలీసులకు ఫిర్యాదు
7



పెరవలి మండలం కానూరు వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, తదితరులు

ఆర్వోబీ పనులు వేగవంతం చేయండి

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్వోబీ పనుల్లో జాప్యం లేకుండా వేగవం తంగా పూర్తి చేయాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. నిడదవో లులో జరుగుతున్న ఆర్వోబీ పనులు, నిడద వోలు మండలం పెండ్యాలలో శుక్రవారం ఆకస్మి కంగా పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.184.74 కోట్ల నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరుగు తున్నాయని ఇప్పటికే 65 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారన్నారు. నిడదవోలు నియోజకవర్గం సురక్షితంగా ఉండేందుకు ఏ విపత్తులు వచ్చినా తట్టుకునే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం చంద్రబాబుకు అందించామని త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందన్నారు. తుఫాన్ బాధిత ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి నిత్యావస రాలు అందించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంద న్నారు. ఎర్రకాలువ ఉప్పొంగినా తుఫాన్, భారీ వర్షాలు, వరదలు సంభవించినా నిడదవోలు నియోజకవర్గం సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి రూ. 290 కోట్ల అంచనాలతో ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించామన్నారు.ఆర్వోబీ సకాలంలో అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఆయన వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కూటమి నాయకులు, తుఫాన్ బాధితులు ఉన్నారు.

ముగిసిన నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె


రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచిత వైద్యసేవలు శనివారం నుంచి యథాతథంగా అందుబాటులోకి రానున్నాయి. బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ స్పెషాలిటీ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్యాలు గత కొన్ని రోజులుగా ఉచిత వైద్యసేవలు నిలిపివేసి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ ఉన్నతాధికారులతో నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించాయి. దీంతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రులన్నింటిలోనూ వైద్యసేవలు అందుతాయని జిల్లా సమన్వయాధికారిణి డాక్టర్ పి.ప్రియాంక తెలిపారు. జిల్లాలో మొత్తం 45 ప్రైవేట్ ఆసుపత్రులు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో అర్హులకు ఉచిత వైద్యసేవలను అందిస్తున్నాయని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా.. రెండు లారీలు సీజ్



కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా ఇసుక రవాణాచేస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకుని పోలీసు కేసులు నమోదు చేసినట్టు మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో అక్టోబరు 30వ తేదీన ఇసుక ర్యాంపుల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బంది ఆంజనేయులు,మైనింగ్ అధికారులు దాడు లు చేశారు. ఈ దాడుల్లో రెండు లారీలు సరైనపత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ వాహనాలు గతంలో ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా చేసిన కేసుల్లో పట్టుబడి జరిమానాలు చెల్లించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వాహన యజమానులే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు గుర్తించడం జరిగింది. దీనిపై రెండు వాహనాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖాధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ పి.విజయకుమార్ తెలిపారు.

ముంచేసిన బురద కాల్వ



నీట మునిగిన వరిచేలు



శ్రీరంగపట్నంలో రోడ్డుకు సమాంతరంగా కాలువ

- ముంపులోనే వేలాది ఎకరాలు
- నీట మునిగిన శ్రీరంగపట్నం
- తగ్గిన వరద ఉధృతి..
- కోలుకుంటున్న రైతాంగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
బురదకాలువ దుఃఖదాయినిగా మారింది. పట్టించుకునే నాథుడే కనిపించకపోవడంతో ప్రతి ఏటా వేలాది ఎకరాల పంట నష్టపోవడంతో పాటు శ్రీరంగపట్నం వంటి గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. గతంలో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా అవి ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. కాలువలో పూడిక తీయకపోవడంతో గురువారం వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి.ఏజెన్సీలోని గంగవరం మండలం పరిధిలోని సూరంపాలెం ప్రాజెక్టు నుంచి బురద కాలువకు వరద వస్తుంది. సూరంపాలెం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి వచ్చే నీటికి నెల్లిపూడి వాగు తోడ వ్వడంతో ఇది బురద కాలువగా అవతరించింది. అక్కడ నుంచి కోరుకొండ మండలం శ్రీరంగపట్నం వరకూ 24 కిలోమీటర్ల మేర ఇది ప్రవహిస్తోంది. కోరుకొండలో 510 హెక్టార్లు, గోకవరంలో 1215 హెక్టార్లు, సీతానగరంలో 1105 హెక్టార్ల పంట నీట మునిగింది. ఊళ్లను, పొలాలను ముంచేస్తుంది. గతంలో ఈ నీరు పంట పొలాలకు ఉపయోగపడేది. దీనికి అనుసంధానంగా 30 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి.ఒక చెరువు నిండి.. అక్కడ మరో చెరువుకు రావడం ద్వారా ఇలా 30 చెరువుల చైన్ లింక్ ఉంది.ప్రస్తుతం చెరువులు ఆక్రమణకు గురికావడం సమస్యగా మారింది. పైగా కాలువ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోరు. ఇది శ్రీరంగపట్నం ఊరికి సుమారు 2 కిలోమీటర్ల లోపు నాలుగు కాలువలుగా మారిపోతుంది. శ్రీరంగపట్నంలో రెండు కాలువలు ఊరి మధ్య నుంచి ఉగ్రరూపంతో ప్రవహిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతీ ఏటా ఊరంతా మునిగిపోయి.. వారం పది రోజుల వరకూ నీరు లాగేది కాదు. ఈసారి ఎగువభాగం రాఘవాపురం సమీపంలో గండ్లు పడడం వల్ల కొంత వరద తగ్గింది.అయినా వడి తగ్గలేదు.పైగా ఈసారి ప్రభుత్వ అధికారులు రెండు కాల్వల గట్లు మీద కొన్ని ఇసుక బస్తాలు పేర్చడంతో కొన్ని వీధుల్లోకి నీళ్ల రాలేదు. ప్రస్తుతం కొత్తకాలువ ప్రభావంతో కాయలవీధి, ఇతర వీధుల్లో నీరు ఉంది.ఊరిలో మురికి దిగే పరిస్థితి లేక డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి.ఇక్కడ అనేక ఇటుక బట్టీలు, పని వారి కోసం నిర్మించిన షెడ్లలోకి నీరెళ్లిపోయింది. ఆళ్లరాము, మళ్లా నరసింహం ఇంటి ఆవరణలో ఇంకా వరద నీరు ఉంది.రెండు రోజుల కిందట బురదకాలువ గుండా 2500 క్యూస్కెల వరద ప్రవహించగా, ప్రస్తుతం 1000 క్యూసెక్కుల వరద ప్రవహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



కోరుకొండ మండలంలో నీటమునిగిన శ్రీరంగపట్నం రోడ్



చివరి... బాతులకు చేటి...

మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు పాలు పోసుకుంటున్న దశలో వున్న వరి చేలు నిండా మునిగాయి. చేలల్లో వున్న వరి గింజలు ఎందుకూ పనికారావు. శాకాహారి అయిన బాతులు మాత్రమే వీటిని తింటాయి. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో రైతులు చేలల్లో వదిలేసిన ధాన్యం గింజలను బాతులు తింటుండగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. ఆ చిత్రాలే ఇవి...



ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



భావ కవితల పాలవెల్లి ఆంధ్రా షెల్లీ

ఆకాశవీధిలో హాయిగా ఎగిరే మేఘమాలికలను ప్రేమికుల నడుమ విరహ సందేశాలుగా పంపగల అభినవ కాళిదాసు ఆయన... మనసున మధుర భావనలను సరళ, లాలిత్యమైన అచ్చతెనుగు పదజాలంతో సామాన్యుని మనోవీధిలో ఎగిరించారు... పద్యానికైనా, పాటకైనా, మరే సాహిత్య రూపమైనా... రూప వ్యవస్థ కంటే భావోన్నతే ముఖ్యమని ప్రకటించి భావ కవి అయ్యారు.



ఆకులో ఆకునై కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై ఈ అడవి సాగిపోనా.. ఎటులైనా ఇచటనే ఆగిపోనా.... అంటూ తన భావ కవితా పటిమతో ప్రకృతి సొందర్యాన్ని వర్ణించిన కవి ఆయన. తన రచనలతో పేరు ప్రఖ్యాతలు గడించారు. సినీ సాహిత్యంలోనూ తనదైన ముద్ర వేసి మూడు దశాబ్దాల పాటు చిత్రసీమలో హవా కొనసాగించారు. ఆయన పాటలు కోయిల గానంలా హాయిగా సంధ్యా సమయంలో గోదావరి గాలిలా ఆహ్లాదకరంగా ఉంటాయి. అంతటి కమ్మని, నెమ్మని రచనలతో తనకంటూ ఓ శైలిని రూపొందించుకున్న ఆయన సదా సాహిత్య స్మరణీయుడు. ఆ భావ కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణశాస్త్రి. నేడు ఆయన 128వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం...



- రావువారిచంద్రపాలెంలో పుట్టి విశ్వ విఖ్యాతి
- సాహితీ పూదోటలో పరిమళాలు
- చిత్రసీమలో మూడు దశాబ్దాలు హవా
- 'వసంత విలాసి' దేవులపల్లి కృష్ణశాస్త్రి 128వ జయంతి సందర్భంగా



(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం రావువారిచంద్రంపాలెంలో 1897 నవంబరు 1న దేవులపల్లి తమ్మన్నశాస్త్రి-సీతమ్మలకు కృష్ణశాస్త్రి జన్మించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్టు ఆయనకు కవిత్వ వాసన అబ్బింది. తండ్రి, పెద తండ్రి స్ఫూర్తితో చిన్నతనం నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు.

- రావువారిచంద్రంపాలెంలో ప్రాథమిక విద్య, పిఠాపురంలో ఉన్నత విద్య, 1918లో విజయనగరం డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు.
- కందుకూరి వీరశలింగంపంతులు, రఘుపతి వెంకటరత్నంనాయుడు శిష్యరికంలో బ్రహ్మ సమాజ ప్రభావ గీతాలు రచించారు. ఆంగ్ల, వంగ సాహిత్యాలపై దృష్టి కేంద్రీకరించారు. ఆ ప్రభావంతోనే కృష్ణపక్షం సంపుటి రాశారు. 1920 నుంచి 1935 వరకు ఆయన అందరిపైనా ప్రభావం చూపారు.
- 1922లో సతీ వియోగంతో 'కన్నీరు' అనే ఖండకావ్యం, ఊర్వశి రాశారు.
- 1929లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కలిశాక ఆ పరిమళం పైపైకి ఎగసి ప్రపంచమంతా పాకి 'ఆంధ్ర షెల్లీ' బిరుదు సంపాదించిపెట్టింది. రవీంద్రుని కవిత్వానికి ఆయన అద్దిన భావ తళుకులు ఎందరినో ఆకట్టుకున్నాయి.
- పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరిన కృష్ణశాస్త్రి సంస్కర ణోద్యమం, బ్రహ్మసమాజం, నవ్య సాహితీ సభ్యులుగా భావ కవి తోద్యమ ప్రచారకుడిగా దేశమంతా పర్యటించారు.
- స్త్రీ, హరిజనోద్ధరణ కార్యక్రమాలు చేపట్టారు. 1933-1941 మధ్య కాలంలో కాకినాడ పీఆర్ కళాశాలలో ఉపన్యాసకుడిగా పని చేశారు.
- 1942లో నిర్మాత బీఎన్ రెడ్డి ప్రోత్సాహంతో చిత్రసీమలో అడుగుపెట్టారు. 1951లో మల్లీశ్వరి చిత్రంలో ఆయన రాసిన ప్రతి పాట సినీ రంగంలో ప్రత్యేక స్థానం కల్పించాయి. 25 సినిమాల్లో 170 పాటలు రచించారు. ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు, మనసున మల్లెలు మాలలూగెనే... వంటి గీతాల పునాదులపై ఆయన చిత్ర జీవితం పాటలా సాగింది.
- దేవులపల్లి సుకుమార సుందర సుమధుర లలిత మనోహర భావాలతో మూడు దశాబ్దాల పాటు సినీ సామ్రాజ్యాన్ని ఏలారు.
- 1945లో ఆకాశవాణిలో చేరాక తెలుగు సాహిత్యమే ఆయనకు వ్యాపకమైంది. దేశభక్తి గీతాలు, గేయ మాలికలు, గేయ కృతులు, పద్య కవితలు, లలిత లాలిత్య గీతాలు, సంగీత రూపకాలు, పిల్లల పాటలు, తిరుప్పావై పాశురాలతో ప్రాచుర్యం గడించారు. హైదరాబాద్ ఆకాశవాణి నుంచి ప్రసారమైన ఇవి ప్రజాదరణ పొందాయి.
- గోదా కల్యాణం, ధనుర్దాసు, వేణుకుంజా, వసంతోత్సవం వంటి నాటకాలు ఎంతో ప్రసిద్ధి పొందాయి.
- దేవులపల్లి చివరి రోజుల్లో 'గోరింట పూచింది కొమ్మ లేకుండా పాట రచించారు. ఆయన రాసిన 'జయజయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి' గీతం జాతీయ గీతానికి అన్ని అర్హతలు ఉన్న గీతంగా గుర్తింపు పొందింది.
- కృష్ణశాస్త్రిని ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతోను, కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్‌తోను సత్కరించాయి.
- 1966లో కంఠం మూగబోయినా రచనలు కొనసాగించారు. 1980 ఫిబ్రవరి 24న తుది శ్వాస విడిచారు.
- దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివిన ఇద్దరు విద్యార్థులు మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి సమక్షంలో దేవులపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం కృష్ణశాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.
- దేవులపల్లి మరణించి 45 ఏళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఆయన్ను సరైన రీతిలో గుర్తించలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు హయాంలోనైనా ప్రభుత్వం తరపున కృష్ణశాస్త్రికి, ఆయన స్వగ్రామమైన రావువారి చంద్రంపాలేనికి తగిన గుర్తింపు లభించగలదని ఆశిద్దాం.



తన జన్మ స్థలమైన రావువారి చంద్రంపాలెంలో అందరినీ విద్యావంతులు చేయాలన్న ప్రగాఢ కాంక్షతో తన సొంతింటిని పాఠశాల నిర్వహణకు ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చిన ధన్యజీవి. నేటికీ ఆయన ఇంటి ఆవరణలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తుండడం గర్వకారణం. అక్కడే దేవులపల్లి అభిమానులు ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 2004లో అప్పటి కలెక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఎంఎస్ఎంఈ యూనిట్ల మంజూరుకు కృషి

ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రహమతుల్లా

సర్పవరం జంక్షన్, అక్టోబరు 31(ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఖాదీ గ్రామీణ బోర్డు ద్వారా ఎంఎస్ఎంఈ యూనిట్లు మంజూరు చేయించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేస్తానని ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు తెలిపారు.కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఏరియాలో గల ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. శ్రీనివాసరావుకు అసిస్టెంట్ డైరెక్టర్ మహ్మద్ రహమతుల్లా పుష్పగుచ్ఛమిచ్చి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు నిరుద్యోగ యువత కోసం అమల్లో ఉన్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లు, సంప్రదాయ పరిశ్ర మల స్థాపనకు ఉన్న అవకాశాలను ఏడీని అడిగి తెలుసుకున్నారు. తొలుత ఆయన ఎమ్మెల్యే నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటికాయల వీరబాబు, పాండ్రంకి రాజు, గేదెల చిన్నారావు, కుర్రా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో వికాస కార్యాలయంలో ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో టీమ్ మేనేజర్, ఐఅండ్‌వీ బయో ఇండియా కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్ యూనిట్, ఏజీ ఐ గ్రీన్ ప్యాక్ కంపెనీలో ప్యాకింగ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ(ప్రొడక్షన్, మెకానికల్ మెయింటెనెన్స్) ఐసాన్ ఎక్స్‌పీరియన్స్‌లో టెలీసేల్స్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్ కంపెనీలో టెక్నీషియన్, ఫాక్స్‌కాన్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బీఈ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12,000-రూ.30,000 వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలకు బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు సర్టి ఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 77993 762 22లో సంప్రదించాలని చెప్పారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన చిట్యాల విద్యార్థులు

గోపాలపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు తూర్పుగోదావరి జిల్లా చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వైఎస్ఎన్ మూర్తి తెలిపారు.ఇటీవల కొవ్వూర్పులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థి ధనుష్, 8వ తరగతి విద్యార్థి ఆర్యాఆనంద్ పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను, సీఆర్‌సీ కొయ్య నాగరాజు అభినందించారు. కాగా, ఈనెలలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారిద్దరూ పాల్గొంటారని చెప్పారు.

రాయవరం నుంచి..

రాయవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పోలిశెట్టి భార్గవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం విప్పర్తి శాంతి సునీత శుక్రవారం తెలిపారు.భార్గవ్ ఇటీవల అనపర్తిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన పోలిశెట్టి భార్గవ్

శనివారం కొవ్వూరులో జరిగే పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, పీడీలు చిక్కాల అజ్జిబాబు, కె.శ్రీనివాస్ అభినందించారు.

జి.దొంతమూరు నుంచి..

రంగంపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శనివారం కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని జి.దొంతమూరు హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న దుప్పలపూడి కామేశ్వరి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు కేవీ రామారావు తెలిపారు. అనపర్తి హైస్కూల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన కామేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ ఈ.లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఆత్మకమిటీ చైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, జనసేన మండలాధ్యక్షుడు గిరజాల సత్తిబాబు, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటకృష్ణ,కూటమి నాయకులు ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా సప్త నదీ జలాభిషేక మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

ఘనంగా రామస్వామి జయంతి

పిఠాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం సప్త నదీ జలాభిషేకం వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన మహోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీపాదశ్రీవల్లభుల దివ్య పాదుకలకు దత్త మూలమంత్ర సప్త నదీజలాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం లక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, దత్త మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంతి సందర్భంగా ఆయన పాదుకలకు పూజలు చేశారు. గోపూజ, అభిషేకాలు జరిగాయి. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శ్రీపాదశ్రీవల్లభులకు సప్తనదీజలాలతో అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ ఎంపికలు



బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులతో వాసంశెట్టి సత్యం

ద్రాక్షారామ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ సెలెక్షన్స్ అండ్ ఛాంపియన్‌షిప్ బాస్కెట్‌బాల్ పోటీలను సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి క్రీడాకారులు ఎదుర్కొనే పలు సమస్యలను సత్యం దృష్టికి తీసుకొచ్చారు. సాయంత్రం చీకటి వల్ల ఇబ్బందులున్నాయని, లైట్స్ కావాలని ఆయనను కోరారు. దీనిపై సత్యం స్పందించి లైటింగ్‌కు రూ.2 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బోటు ఫెస్టివల్ పోటీల నిర్వహణకు చర్యలు



లొల్ల లాకులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

లొల్ల లాకులను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాబోయే సంక్రాంతి మూడు రోజులు బోటు ఫెస్టివల్ పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు ఆర్డీవో శ్రీకర్ తెలిపారు. శుక్రవారం లొల్ల లాకులు, తాడిపూడి, ఉచ్చిలి ప్రధాన కాలువలను ఆయన పరిశీలించారు.గతేడాది బోటు ఫెస్టివల్ కంటే అదనంగా మరిన్నీ కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను తిలకిచేందుకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎంతో ఆహ్లాదకరమైన ఈ ప్రాంతంలో కార్తీకమాసం పిక్నిక్‌లు నిర్వహించేందుకు అనువైన లాకుల ప్రాంతాన్ని తీర్చిదిద్దాలన్నారు. తహశీల్దారు రాజేశ్వరరావు, ఆర్ఐ భాను పాల్గొన్నారు.

ఆధునిక ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి ఒప్పందం



ఒప్పంద పత్రం చూపుతున్న శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ ఎండీ అహ్మద్ ఆలీషా

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ముంబై వేదికగా అక్టోబరు 27నుంచి 31వరకు జరిగిన ఇండియా మారిటైమ్ వీక్-2025 సదస్సులో పాల్గొన్న కాకినాడకు చెందిన శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ జపాన్, నార్వే సాంకేతిక సహకారంతో ఆధునిక ఎలక్ట్రిక్ షిప్పుల తయారీకి భారత ప్రభుత్వంతో సాంకేతిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ దేశాల షిప్పింగ్ దిగ్గజ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పోర్టులు, నౌకాశ్రయాలు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పలువురు కేంద్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు శాన్ మారిటైమ్ షిప్పింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ ఆలీషాను అభినందించారు.

పోలీస్ అమర వీరులకు సెల్యూట్



పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి త్రీటౌన్ పోలీస్ స్టేషను నుంచి పుష్కర్‌ఘాట్ వరకూ పోలీసులు, ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరమని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వారి సేవలను భరత జాతి ఎన్నటికీ మరువదన్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి).

హెరాల్డింగ్ పరేడ్‌లో ముక్కామల కళాకారులు

అంబాజీపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని కెవడియా ఏక్తా నగర్‌లో సంగీత నాటక అకాడమీ- భారత మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో జరిగిన హెరాల్డింగ్ పరేడ్‌లో ముక్కామలకు చెందిన కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా దాదాపు 120మంది కళాకారులు పాల్గొనగా ఏపీ నుంచి ఇద్దరు కళాకారులు ఉండగా విజయదుర్గ గరగల బృందం తరపున పసుపులేటి కుమార్(డోలు)ను పంపించామని ట్రూప్ లీడర్ పసుపులేటి నాగబాబు తెలిపారు. ప్రధాని మోదీ ఎదుట ఈ ప్రదర్శన ఇవ్వడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. తొలుత సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య, కొరియోగ్రాఫర్ లోకేశ్ ఆనంద్ నేతృత్వంలో పది రోజులు రిహార్సల్స్ జరిగాయన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న కళాకారుడు కుమార్

గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలి

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

పరిశీలించిన అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్



గిరిప్రదక్షిణ రోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో, చైర్మన్, అధికారులు

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కోరినకోర్కెలు తీర్చే భక్తవరదాయుడు అన్నవరం సత్యదేవుడికి ఈనెల 5న కార్తీక పౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరగనుంది. సుమారు 2లక్షల మంది భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా సుమారు 11.5 కిలోమీటర్ల మేర రత్న,సత్యగిరిలు చుట్టూ ఉదయం పల్లకీతో, మధ్యాహ్నం సత్యరథంతో తిరుగుతారు. వారికి అసౌకర్యం కలగకుండా చేస్తున్న ఏర్పాట్లను శుక్రవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పరిశీలించారు. ఈ దారిలో వైద్యశిబిరాలు, భక్తులకు పంచిపెట్టేందుకు పళ్లు, మజ్జిగ వితరణ బిస్కట్ల పంపిణీ స్టాల్స్‌ను పరిశీలించారు. రోడ్డుపై ఎటు వంటి రాళ్ల లేకుండా రోలింగ్ చేయించాలని చైర్మన్ సూచించారు. భక్తులు మధ్యాహ్నం రెండు గంటలకు తొలిపావంచా వద్దకు చేరుకుని సత్యరథం వెంట గిరిప్రదక్షిణ చేసేలా విస్తృత ప్రచారం గావించాలని పీఆర్వో విభాగ అధికారులను ఆదేశించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా స మన్వయంతో గిరిప్రదక్షిణను విజయవంతం చే యాలని కోరారు. వారివెంట ఇంజనీరింగ్, పీఆర్వో, విభాగ అధికారులతో పాటుగా ఏఈ వోలు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.

నిండుకుండలా...

ఏలేరు జలాశయం

దిగువకు 6వేల క్యూసెక్కుల నీరు విడుదల



ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు

ఏలేశ్వరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి 6వేల క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. తుఫాను కారణంగా ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీంతో ఎగువ ప్రాతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరడంతో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో 6175 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ప్రాజెక్టులో మరో రెండు టీఎంసీలు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో శుక్రవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.71 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.38 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని, దిగువ ప్రాంతాలకు 6వేల క్యూసెక్కులనీటిని అధికారులు విడుదల చేశారు.



పంపా రిజర్వాయర్‌లో ట్రయిల్‌రన్ నిర్వహిస్తున్న అధికారులు

తెప్పోత్సవానికి జాగ్రత్తలు తీసుకోవాలి

పంటుకు రెండోసారి ట్రయిల్‌రన్ విజయవంతం

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది సత్యదేవుడి తెప్పోత్సవం నిర్వహణలో జాగ్రత్తలు మరింతగా తీసుకోవాలని చైర్మన్ రోహిత్ సూచించారు. ఈనెల 2న రాత్రి 7గంటలకు పంపా సరోవరంలో నౌకావిహారం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం రెండోపర్యాయం అన్నిశాఖల అధికారులు, ఈవో, చైర్మన్ హంసవాహనంగా రూపుదిద్దుకోనున్న పంటుకు ట్రయిల్ రన్ నిర్వహించారు. పంపా రిజర్వాయర్‌లో ఈసారి నీటిమట్టం అధికంగా ఉన్నందున అనుమతించిన వైదిక సిబ్బందిని మాత్రమే పంటుపైకి ఎక్కించాలని, ఈ విషయంలో సిఫార్సులకు తలొగ్గవదన్నారు. లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేవిధంగా కోఆర్డినేట్ చేసుకోవాలని చైర్మన్ సూచించారు. నిర్దేశించిన సమయానికి వైదిక కార్యక్రమాలు, నౌకావిహారం జరగాలన్నారు. అనంతరం ప్రసాద వితరణలో క్యూలైన్ వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలని సూచించారు.

సత్యదేవుడి సన్నిధిలో గరికపాటి పూజలు



వేదాశీర్వచనాలు పొందుతున్న గరికపాటి నరసింహారావు కుటుంబం

అన్నవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. బంధువుల వివాహానికి హాజరైన వారు కొండదిగువన వివాహం అనంతరం స్వామివారి సన్నిధికి విచ్చేశారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

హైవేపైకి ఏలేరు వరద నీరు



గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో హైవేపైకి చేరిన ఏలేరు వరద నీరు

గొల్లప్రోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపైకి శుక్రవారం మధ్యాహ్నం ఏలేరు వరద నీరు చేరింది. ఏలేరు కాలువలకు గండ్లు పడడంతో పొలాల మీదుగా వచ్చి న వరద నీరు రోడ్డుపై నిలిచిపోయింది. రైతులు గట్లుపై ఇసుకబస్తాలు వేసి నీరు రాకుండా కట్ట డి చేయడంతో రహదారిపై నీరు సాయంత్రం నుంచి పెరగలేదు. లేకుంటే జాతీయ రహదారిపై ఒకవైపు వరద నీరు ప్రవహించేదని అధికారులు తెలిపారు.

‘ఎంఎస్ఎన్’ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం



ధర్మకర్తల మండలిని సత్కరించిన దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురంలో మల్లాడి సత్యలింగం నాయకర్ చారిటీస్ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని సహాయ కమిషనరు, కార్య నిర్వహణాధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త మల్లాడి కార్తీక్ నాయకర్ చైర్మన్‌గా వ్యవహరించారు. ధర్మకర్తలుగా నులుకుర్తి శ్రీసత్యసాయి, మూగు చిన్ని, పిల్లారిశెట్టి దుర్గాప్రసాద్, రాళ్లపూడి ప్రకాష్, పీర్ల లక్ష్మీప్రసన్న, అరదాడి భవాని, ఓలేటి దుర్గ, మందపాక త్రిలోచన, ధూళిపాల సూర్యభగవాన్‌తో సహాయ కమిషనరు, ఈవో బళ్ల నీలకంఠం ప్రమాణం చేయించారు. ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై అసత్య ప్రచారం..

భరత్‌రామ్‌పై చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరంలో త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ లీగల్ సెల్ ఫిర్యాదు



త్రీటౌన్ సీఐకు ఫిర్యాదు అందిస్తున్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై నిరాధారమైనఆరోపణలు చేస్తున్న వైసీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ లీగల్‌సెల్ కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్ చేరుకుని సీఐ అప్పారావుకు ఫిర్యాదు అందించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసు వ్యక్తిగత, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా భరత్‌రామ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేస్తున్నారని వివరించారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విగ్గు పెట్టుకుని స్టైల్‌గా కళ్లజోడు పెట్టుకుని మద్యం తాగి అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్నారంటూ అభాండాలు వేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ జగన్ పెగ్గు పోశారని ఒప్పుకుంటే బాలయ్యబాబు మద్యం తాగారని తాము ఒప్పుకుంటామని సమాధానమిచ్చారని, అయితే జగన్ పోసాడా అనే మాటలను కట్ చేసి తాగి వచ్చారు అనే మాటలతో సోషల్ మీడియాలో ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా భరత్‌రామ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీను, బూరా రమణ, ఉడమల నాగేశ్వరరావు, చెన్నా వెంకటరమణ, కారంగీ వీర్రాజు, బత్తిన రవికుమార్, కొమరం సురేష్, దుత్తరపు గంగాధర్, కానేటి ప్రభుదాస్, బాబ్జి పాల్గొన్నారు.

పరిపాలనాధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతి

కాకినాడ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారులుగా పనిచేస్తున్న ఇద్దరికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. వారికి మండలాలు కేటాయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎంపీడీవోగా జేఎల్ఎన్ దీక్షితులు, కాకినాడ జిల్లా కరప ఎంపీడీవోగా జె.శ్రీనివాస్ నియమితులయ్యారు. కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జి సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

నా భర్తను కిరాతకంగా చంపారు..

న్యాయం చేయండి

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి మృతుడి భార్య వేడుకోలు



కొంకాపల్లిలో విలపిస్తూ తన గోడును వివరిస్తున్న కంచిపల్లి శ్రీదేవి

అమలాపురం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): “నా భర్తను అతి కిరాతకంగా చంపి నదీ పాయలో పడేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇద్దరు బిడ్డలతో ఉన్న నా కుటుంబానికి న్యాయం చేయాలి” కంచిపల్లి దేవి వేడుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సోషల్ మీడియా వేదికగా శుక్రవారం తన గోడును వెల్లబోసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన నా భర్త కంచిపల్లి శ్రీనివాస్ (37) అక్టోబరు 25న ఇంటి నుంచి వెళ్లి 29న పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలోని గోదావరి నదీపాయలో శవంగా కనిపించాడని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులకు 27నే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివరించింది. గంగుమళ్ల కాసుబాబు, అడబాల శంకర్‌ల బృందం తన భర్తను అతి కిరాతకంగా చంపేశారని ఆరోపించింది. తన కుటుంబానికి మీరే న్యాయం చేయాలని వేడుకుంటూ సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేసింది. ఇలా ఉండగా హత్య అనంతరం అదృశ్యమైన కాసుబాబుతో సహా ఐదుగురు వినియోగించిన సెల్‌ఫోన్ల కాల్స్ ఆధారంగా కేసును చేధించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రధాన నిందితులు వినియోగించిన ఫోన్ కాల్ డేటా ఆధారంగా హత్యకు ముందు ఎవరెవరితో మాట్లాడారు, హత్యకు ఎవరు సహకరించారు అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన ఏరియా ఆసుపత్రి నుంచి శుక్రవారం నివేదిక వస్తుందని పోలీసులు భావించారు. కేసును చేధించేందుకు ప్రత్యేక బృందాలు గాలింపును ముమ్మరం చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇలా ఉండగా శ్రీనివాస్ ఇంటి వద్ద చిన్న కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఏదైనా ఆందోళన జరగవచ్చన్న సమాచారంతో డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు అప్రమత్తమయ్యారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు

రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో తొలగింపు



వల్లూరులో షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామంలోని పంచాయతీ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగిందంటూ గ్రామకార్యదర్శి సత్తిబాబు, తహశీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో హెచ్.భానూజీరావు కు ఫిర్యాదు అందింది. దీనిపై శుక్రవారం రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో షెడ్డు తొలగించారు. కార్యదర్శి సత్తిబాబు తెలిపిన వివరాల ప్రకారం... వల్లూరు గ్రామపంచాయతీ పరిధిలో నిడసన మెట్టకు వెళ్లే రహదారి పక్కనే ఉన్న సర్వే నెం.205బై6లో 9 సెంట్లు పంచాయతీ స్థలం ఉంది. ఆ స్థలంలో గతంలో దళిత సామాజిక వర్గీయులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ విగ్రహానికి చేర్చి గత నెల 20న మళ్లీ నూతనంగా షెడ్డు నిర్మాణం చేశారు. ఆ స్థలం ప్రజలకు అవసరార్థం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి పంచాయతీ కేటాయించింది. పంచాయతీ అనుమతులు లేకుండా ఆ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరిగినట్టు తన దృష్టికి రావడంతో వెంటనే తహశీల్దార్, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దీనిపై తహశీల్దార్ సదరు ఆక్రమణ తొలగింపునకు పోలీస్ రక్షణ కావాలంటూ అంగర ఎస్ఐ హరీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేయగా పంచాయతీ అధికారులు అక్రమంగా నిర్మించిన షెడ్డను తొలగించారు. సీఐ దొరరాజు మాట్లాడుతూ ఎవరైనా అక్రమ చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయవరం, ద్రాక్షారామం ఎస్ఐలు, మండపేట ట్రైనీ ఎస్ఐలు సురేష్‌బాబు, లక్ష్మణబాబు, సోమేంద్ర, ఆర్ఐ అర్జమ్మ తదితర సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న 17 మంది అరెస్ట్

అమలాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని భూపయ్య అగ్రహారం, వడ్లమానివారి వీధిలో గల ఒక అపార్టుమెంటులో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న రాజకీయ పార్టీకి చెందిన కీలక నాయకులతో సహా సుమారు 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30,140 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే అమలాపురం పట్టణ పరిసరాల్లో పేకాట క్లబ్‌లు నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని సోషల్ మీడియాలో మహిళా నేత బొజ్జా ఐశ్వర్య ఇటీవల ఒక వీడియో విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీకి అందిన సమాచారంతో గురువారం రాత్రి దాడిచేసి 17మందిని అదుపులోకి తీసుకున్నారు.

తప్పిపోయిన రేపాక ఆశ్రమ పాఠశాల విద్యార్థి

కూనవరం వద్ద పోలీసులకు క్షేమంగా దొరికిన బాలుడు



పోలీసుల వద్ద క్షేమంగా ఉన్న విద్యార్థి తేజ

కూనవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం రేపాక ఆశ్రమ పాఠశాల విద్యార్థి గుజ్జ స్వాత్విక్ తేజ గురువారం పాఠశాల నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న తేజ వెళ్లిపోయినట్టు గుర్తించిన సిబ్బంది ఈ మేరకు కూనవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ లతాశ్రీ శుక్రవారం సోషల్ మీడియా ద్వారా బాలుడు తప్పిపోయినట్టు ప్రచారం చేశారు. శుక్రవారం రాత్రి 7 గంటల స మయంలో విద్యార్థి తేజ కూనవరం సెంటర్‌లో కనిపించడంతో గ్రామస్తులు ఎస్ఐకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ బాలుడిని గుర్తిం చి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం బాలుడు పోలీసుల దగ్గర క్షేమంగా ఉన్నాడు. అయితే హెచ్ఎం, వార్డెన్ నిర్ల క్ష్యం కారణంగానే విద్యార్థి బయటకు వెళ్లిపోయినట్లు విమర్శలు వస్తున్నాయి. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అదృశ్యమైన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మైనర్ బాలికలను 24 గంటల్లో వెతికి కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లిలో నివసిస్తున్న మైనర్ బాలికలైన అవల కీర్తి, అవల నవ్య అక్టోబరు 30న ఉదయం 10 గంటలకు పూసలు అమ్ముకోవడానికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి ఆటోలో బయటకు వచ్చారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికలు ఎక్కిన ఆటోడ్రైవర్‌ను విచారించగా బాలికలు ఆటోడ్రైవర్ ఫోన్ నుంచి గతంలో వాడపల్లిలో తమ ఇంటిపక్కనే నివాసం ఉన్నవారికి జంగారెడ్డిగూడెం ఫోన్ చేశారని తెలిపాడు. పోలీసులు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికలను తీసుకొచ్చి తహశీల్దార్ స్టేట్‌మెంటు తీసుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తల్లి మందలించడంతో బాలికలు జంగారెడ్డిగూడెం వెళ్లినట్టు పేర్కొన్నారు.

యానాం నుంచి బీర్లు రవాణా

ఇద్దరిపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యానాంలో 24 టిన్ బీర్లను కొనుగోలు చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన దాసరి పృథ్వీ వెంకటసాయి నితీష్, గడుసుకోట భానుప్రకాష్ అక్టోబరు 29న యానాంలో 24 టిన్ బడ్వయిజర్ బీర్లను కొనుగోలు చేసి కారులో నిడదవోలు తీసుకువస్తుండగా మద్దూరులంక బ్యారేజ్‌పై మోటారుసైకిల్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో గ్యాస్ ఏజెన్సీ ఆటోడ్రైవర్ చాగల్లు మండలం దారవరానికి చెందిన షేక్ ఖాదర్ కాజా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కారును మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో 24 బడ్వయిజర్ బీర్లు కనిపించాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని నితీష్, భానుప్రకాష్‌పై కేసు నమోదు చేశారు.

సారాతో ముగ్గురి అరెస్ట్

శంఖవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం మండపం సెంటర్‌లో హైవేపై గురువారం రాత్రి ఆటోలో తరలిస్తున్న 72 లీటర్ల సారాను తరలిస్తున్న ముగ్గురు నిందితులను అన్నవరం పోలీసులు అరెస్ట్ చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

ఏపీఆర్డీసీ డైరెక్టర్‌గా వెన్న శివ నియామకం



వెన్న శివ

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కత్తిపూడి గ్రామా నికి చెందిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్న ఈశ్వరుడు (శివ)ను ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలపెమెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ)డైరెక్టర్ నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 16అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 16 మందిని ఏపీఆర్డీసీ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తనకీ ఉన్నత పదవి అవకాశం కల్పించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభకు శివ ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, ఏళ్ళ జగదీష్, బద్ది రామారావు, సాధానాల లచ్చింబాబు అభినందనలు తెలిపారు.

ఏపీఆర్డీసీ సభ్యుడిగా ముదునూరి వేణుగోపాలకృష్ణ

అమలాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్డీసీ) సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ముదునూరి వేణుగోపాలకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఆర్డీసీ సభ్యుడిగా రెండేళ్ల పాటు పద విలో వేణుగోపాలకృష్ణరాజు కొనసాగనున్నారు.

పత్తి పంటల పరిశీలన



ధర్మవరంలో పత్తి పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రత్తిపాడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో దెబ్బతిన్న పత్తి పంటలను శుక్రవారం ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఎం.రాంభద్ర రాజు, ఐ.సుధీర్, వ్యవసాయ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్. పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి జోకా అమృత, పెద్దాపురం ఏరువాక కేంద్రం అధికారులతో కలిసి శాస్త్రవేత్తలు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటపై ఆశించిన కాయకుళ్లు తెగులు నివారణకు పాటించాల్సిన విషయాలు వివరించారు. ధర్మవరం రైతు సేవా కేంద్ర సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ప్రజల ఆరోగ్య భద్రతకు కృషి చేయాలి



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

కోరుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల ఆరోగ్య భద్రతకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని కోరుకొండ, శ్రీరంగపట్నం, కోటికేశవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తుఫాను తర్వాత చేపడుతున్న వైద్య చర్యలు, తాగునీటిని ల్వల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, గృహ సర్వే కార్యక్రమాల అమలును సమీక్షించారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య భద్రత కోసం నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సిబ్బందికి సూచించారు. వెక్టర్‌బోర్న్ వాటర్‌బోర్న్ వ్యాధుల నివారణ చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు, చెత్త, మురుగు నీటిని సకాలంలో తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని డీఎంహెచ్‌వో చెప్పారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణల పరిశీలన

గోకవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ముంపునకు గురవుతున్న అచ్చియ్యపేట కాలనీని శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న అనధికార లేఅవుట్‌లో ఆక్రమణకు గురైన డ్రైనేజీని గుర్తించారు. తుఫాన్ కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించేందుకు గత నెల 30న గోకవరం విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు అచ్చియ్యపేట వాసులు డ్రైనేజీ ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్రమణపై విచారణ జరిపి నివేదికను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులు పరిశీలన చేసి డ్రైనేజీ ఆక్రమణతో పాటు, లేఅవుట్ చుట్టూ నిబంధనలకు విరుద్ధంగా కాంపౌండ్ వాల్ నిర్మించడాన్ని గ్రహించారు. సమగ్ర నివేదికను ఉన్నతధికారులకు అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఆక్రమణలను పరిశీలించిన వారిలో తహశీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో గోవింద, పంచాయతీ కార్యదర్శి శిరీష, తదితరులు ఉన్నారు.

బిలాల్ మస్క్ షాదీఖానా కమిటీ నియామకం



కమిటీ పేర్లను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక బిలాస్ మస్క్ షాదీఖానాకు 11 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రకటించారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు ద్వారా ఈ కమిటీని వేసారని ఈ మేరకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. కమిటీ నియామక పత్రాలను మహ్మద్ అబ్దుల్‌లతో కలిసి అందించారు. అధ్యక్షుడిగా మహ్మద్ ఇమానుద్దీన్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ అజీమ్, కార్యదర్శిగా మహ్మద్ కరీముల్లా ఖాన్, ట్రెజరర్‌గా అల్లాఉద్దీన్ షరీఫ్‌తోపాటు మరో ఐదుగురిని సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ రెండేళ్లపాటు వక్ఫ్‌బోర్డుకు చెందిన ఆస్తులను సంరక్షిస్తుందన్నారు.కార్యక్రమంలో చాన్ బాషా, రఫీక్ రాజా, షేక్ బషీర్, అస్లాం, మహబూబ్ జానీ, మహ్మద్ బాబాఖాన్, అప్సరీ, ఎం.ఖాన్, అహ్మద్ నిషా పాల్గొన్నారు.

అండర్-17 బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక



అండర్-17 వాలీబాల్ బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనపర్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం డివిజన్‌కు సంబంధించి శుక్రవారం అనపర్తిలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో అండర్-17 బాలికల వాలీబాల్ జట్టును ఎంపిక చేశారు.ఈ జట్టు శనివారం కొవ్వూరులో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొంటుంది. అలాగే అనపర్తి మండల స్థాయి అండర్-14, 17 విభాగాల్లో కోకో, కబడ్డీ, యోగా, చెస్, షటిల్ బాడ్మింటన్‌లలో మండల స్థాయి జట్లను కూడా ఎంపిక చేశారు. ఈ జట్లలో ఎంపికైన క్రీడాకారుల్లో శనివారం జరిగే ఎంపికల్లో రాజమహేంద్రవరం డివిజన్ స్థాయి ఎంపికలు చేపట్టనున్నట్టు కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఎంపికలకు 500మంది క్రీడాకారులు, 80మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ టీవీఎస్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధనకు తరలిరండి

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలో ఈనెల 2న జరిగే శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన ఈడిగ, యాత కులాల కార్తీక వన సమారాధనకు సంఘీయులంతా తరలిరావాలని రాష్ట్ర శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీవెంకటేశ్వనగర్‌లోని శెట్టిబలిజ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పెద్దల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంగారెడ్డిగూడెం, కామవరపుపాడు, కొయ్యలగూడెం, జీలుగుమామిడి, బుట్టాయగూడెం మండలల పరిధిలో సంఘీయలు ఈ కార్యక్రమంలో పాల్గొని మన ఐక్యతను చాటాలన్నారు. సమావేశంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

జీఆర్పీ సీఐగా రమణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వైవీ రమణ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఆయన ప్రస్తుతం రేంజ్ వీఆర్‌లో ఉన్నారు. ఇక్కడ సీఐగా పని చేసిన పి.శ్రీనివాస్ ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. అప్పటి నుంచీ కాకినాడ జీఆర్పీ సీఐ శ్రీనివాసరెడ్డి రాజమహేంద్రవరంలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

సీసీలతో చోరీల నియంత్రణ

బిక్కవోలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దొంగతనాలు అరికట్టవచ్చునని బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ సూచించారు. కొంకుదురు గ్రామ సచివాలయంలో శనివారం ఆయన సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీసీ కెమెరాల వల్ల దొంగతనం చేసేందుకు దొంగలు భయపడతారని, అలాగే చేసిన దొంగలను సులువుగా పట్టుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొవ్వూరి వేణుగోపాల రెడ్డి, సత్తినాగిరెడ్డిరాజా పాల్గొన్నారు.



నన్నయ వర్శిటీలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

స్ఫూర్తి ప్రదాత పటేల్

» నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య స్వామి
» ఘనంగా ఉక్కు మనిషి జయంతి
» జాతీయ ఐక్యత దినోత్సవం
» పలుచోట్ల ర్యాలీలు



బిక్కవోలులో పటేల్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

దివాన్‌చెరువు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజలందరినీ ఐక్యంగా ఉంచాలనే సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయం నేటికీ మనందరికీ స్ఫూర్తినిస్తుందని, జాతీయ సమగ్రతకు ఆయన నిలువెత్తురూపమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి అన్నారు. భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని నన్నయ వర్శిటీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి రిజిస్ట్రార్ స్వామి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో రాష్ట్రీయ ఏక్తా దివస్ మార్చ్‌ఫాస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడంలో పటేల్ కృషి, అంకుఠిత దీక్ష ఎప్పటికీ మరువలేవని అన్నారు. పటేల్ దార్శనికత, రాజనీతిజ్ఞత కారణంగానే నేడు మనం చూస్తున్న సమగ్ర భారతదేశం సాధ్యమైందని అన్నారు. ఆయన రాజకీయనాయకుడు మాత్రమే కాదని దేశభక్తికి, త్యాగానికి , అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం అని చెప్పారు. అనంతరం దేశ ఐక్యతకు భద్రతకు కృషిచేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, పీవోలు పాల్గొన్నారు.

కడియం: కడియంలో బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన వజ్ర సంకల్పుడు, నిష్కలంక దేశభక్తుడు వల్లభాయ్‌పటేల్ అన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీధర్, చిక్కాల ఈశ్వరరావు, గుత్తుల హరిప్రసాద్, గారపాటి తాతబ్బాయి, చిక్కాల శ్రీను, పెనుమాక శేషగిరి, దాసరి ముత్యం పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆశ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్శిటీ భౌతిక శాస్త్ర విభాగాధిపతి గౌరీశంకర్, సహాయ ఆచార్యుడు ఎస్.గౌరీరెడ్డి మాట్లాడుతూ భారతీయుల్లో భిన్నత్వంలో ఏకత్వం అనే భావనతో మేల్కొల్పిన మహోన్నత నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు. భారతదేశ సమైక్యతకు రూపశిల్పిగా నిలిచిన పటేల్ దేశంలోని సంస్థానాలను విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే పటేల్ జయంతి సందర్భంగా గైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని జీజీయూ ప్రొ వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ఆర్ఎస్ రాజు, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ సెంటర్లో బీజేపీ నాయకులు ఐక్యత కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర నాగేంద్ర మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడడంలో సర్దార్ వల్లభాయి పటేల్ చేసిన సేవలు అపూర్వమని, దేశ ప్రజలను ఏకం చేయడంలో అప్రతిహతమైన కృషి చేశారన్నారు. అంతకుముందు బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వల్లభాయి పటేల్ చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, పలువురు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో యెనుముల రంగబాబు, కురగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వల్లభాయి పటేల్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉక్కు మనిషి పటేల్ అని కొనియాడారు. లెఫ్టినెంట్ ఈసుబ్ భాషా, తదితరులు మాట్లాడారు. ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, వైఆర్‌సీ సభ్యులు పాల్గొని జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వతంత్ర భారతాన్ని తీర్చిదిద్దిన రూపశిల్పి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని, 562 సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఆయనకే దక్కుతుందన్నారు.దేశ తొలి ఉపప్రధాని, హోంమంత్రి, సమాచార ప్రసార శాఖామంత్రిగా పనిచేసిన పటేల్ దేశానికి ఎన్నో సేవలందించారన్నారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో నాగేంద్రప్రసాద్, ఏపీవో అగస్టీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పలువురు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఐక్యత ర్యాలీలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు,ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో పటేల్ అందించిన సేవలు మరువరానివని, నేటి యువత దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడడంలో తమ వంతు పాత్రను సమర్థవంతంగా పోషించాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాష్ట్రీయ ఏక్తా దివస్ ర్యాలీని నిర్వహించారు. ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, రెహమాన్, ఆనందరావు, జీవీఎస్ నాగేశ్వరరావు, శిరీషసునీత, బళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటేల్ చిత్రపటానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు తరువాత పటేల్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని, స్వాతంత్ర్యం తరువాత మన దేశంలో ఉన్న దాదాపు 560 సంస్థానాలను ఒక్కటిగా చేసి భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



రాజమహేంద్రవరంలో బీజేపీ ఆధ్వర్యంలో ఐక్యత ర్యాలీ



గైట్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్‌కేఆర్ కళాశాలలో రాష్ట్ర ఏక్తా ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

బాధితులకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ



ధవళేశ్వరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్/కడియం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతాంగానికి, ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శుక్రవారం మండలంలోని ధవళేశ్వరం, హుకుంపేట, కాతేరు గ్రామాల్లో మత్స్యకారుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధవళేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ముందస్తుగానే అప్రమత్తం చేయడం వల్ల తుఫాను వల్ల కలిగే నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. అధిక వర్షాల వల్ల పంట నష్ట జరిగినప్పటికీ ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కరెంటు స్తంభాలు, చెట్లు కూలినా అధికారుల తక్షణ చర్యలతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. మూడు నాలుగు రోజులుగా మత్స్యకారులు పనుల్లేక ఇబ్బందులు తలెత్తడంతో వారికి అండగా ప్రభుత్వం నిలచిందన్నారు. ఈ సందర్భంగా 424 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి 50 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, పామాయిల్, పంచదార, ఉల్లిపాయలు,బంగాళా దుంపలు, పంపిణీ చేశారు. దీనితో పాటు పునరావాస కేంద్రంలో ఉన్నవారికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు రూ.1,55,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్,మత్స్యశాఖ అధికారి నిర్మలకుమారి, పంచాయతీ కార్యదర్శులు వెంకట్రావు, కాశీవిశ్వనాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

వేమగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రం

కడియం మండలం వేమగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పంట నష్టం అంచనాకు ఇప్పటికే అధి కారులు సర్వే చేస్తున్నారన్నారు. అనంతరం తుఫాన్ ప్రభావంతో ఉపాధి కోల్పోయిన, మత్స్యకార కుటుంబాలకు ఆరు రకాల సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, పితాని శివరామకృష్ణ,చెల్లుబోయిన శ్రీను, వెలుగుబంటి నాని, బొర్సు సుబ్రహ్మణ్యం, పాటంశెట్టి రాంజీ, గుత్తుల ముత్యం, దంగేటి సత్తిబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాఘవాపురంలో పంటల పరిశీలన

కోరుకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవాపురంలో మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పంటలను, ఇళ్లను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాను వల్ల పంట పొలాలు, ఉద్యాన పంటలు నేలకొరిగి రైతన్నలకు భారీ నష్టం జరిగిందని, బాధిత రైతులకు ప్రభుత్వం భరోసాగా ఉంటుందని, పంట నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకొంటుందన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: మనోజ్‌రెడ్డి

అనపర్తి/బిక్కవోలు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. అనపర్తి మండలం కొప్పవరం,బిక్కవోలు మండలం కొమరిపాలెంలో నేలకొరిగి,నీట నానుతున్న వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు.. ఇప్పటికే అడుగున్న ఉన్న పనలు మొలకలు వస్తున్నాయని పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మనోజ్ మాట్లాడుతూ ఇప్పటికే అధికారులు నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించే పనిలో ఉన్నారన్నారు. కాగా కొమరిపాలెంలో 680 ఎకరాల్లో వరికి నష్టం కలిగిందన్నారు. కార్యక్రమంలో కర్రి వెంకటరామారెడ్డి, అశోక్‌రెడ్డి, కొమరిపాలెం సొసైటీ అధ్యక్షుడు డీవీఆర్, టీడీపీ మండలాధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



రాఘవాపురంలో పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల



కొప్పవరంలో వరి పంటను పరిశీలిస్తున్న మనోజ్‌రెడ్డి

ఏకైక మహిళా ప్రధాని ఇందిరా గాంధీయే

వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశానికి ఏకైక మహిళా ప్రధాన మంత్రి ఇందిరా గాంధీయే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక సీతంపేట రాజీవ్‌గాంధీ పార్కులో ఆమె విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన పంచ సూత్రాలు దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, బత్తిన చంద్రరావు, వీర్రాజు, దంటు వీరవెంకట్రావు, నారాయణపురం సతీష్ పాల్గొన్నారు. జాంపేట వంతెన వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో పూలమాలలతో నివాళులర్పించారు. ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన బ్యాంకుల జాతీయకరణ, రాజాభరణలు రద్దు, 20 సూత్రాల పథకం వంటివి దేశ చరిత్రలో నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో చింతాడ వెంకటేశ్వరరావు, చామర్తి లీలావతి, పట్నాల శ్రీనివాస్, కాటం రవి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలోని సూర్యారావుపేటలో వడయార్స్ ప్రాంగణంలోను, రాజానగరం గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వై.శ్రీనివాస్, రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ వైఏ వడయార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లేటి కృపానందం, ఎం.రాజేష్, మండలాధ్యక్షుడు సుభాష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

రాజానగరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ వై.శ్రీకాంత్ విద్యార్థులకు సూచించారు. మండలంలో కానవరంలోని గాయత్రి విద్యాసంస్థల్లోని విద్యార్థులకు రాజమహేంద్రవరం సైబర్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలు, మోసాలు, జరుగుతున్న తీరును ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. మనం ప్రస్తుతం డిజిటల్ యుగంలో బతుకుతున్నామని, దీని వల్ల సమాజంలో విద్యార్థులు ఎంతో కోల్పోతూ, అనేక రకాల మోసాలకు గురవుతున్నారన్నారు. ఇటువంటి మోసాలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎ తరగతి సభ్యుడు కొప్రపాటి నాగమురళి శివ ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి తల్లి సామ్రాజ్యంకు, వారి జీవనాధారం దృష్టిలో ఉంచుకుని, బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాద బాధితులకు, బ్యాంకు అండగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో కప్పల సూర్య ప్రకాష్, పిల్లి శ్యామ్‌కుమార్, మురిగి శ్రీనివాసరావు, యర్రమోతు ధర్మరాజు, పడాల శ్రీనివాస్, ముదిగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము పరిశీలన

రాజమహేంద్రవరం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎఫ్‌సీఐ గోదాముల ఆవరణలోని ఈవీంలు భద్రపరిచిన గోదామును డీఆర్వో టి.సీతారామ మూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల ప్రకారం నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను భద్రత పరిచిన ప్రదేశాలను తనిఖీ చేసి సంబంధిత రిజిస్టర్లలో సంతకాలు చేశామన్నారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరచారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, అర్బన్ తహశీల్దారు పాపారావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు మనిషి జయంతి

రంగంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ఆంజనేయస్వామి గుడి ఆవరణలో శుక్రవారం రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడియ్య ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మరిడయ్య మాట్లాడుతూ పటేల్ నిష్కళంక దేశ భక్తుడు, దేశంలోని 562 సంస్థానాలను కలిపిన గొప్ప సమైక్యతావాదని ఆయన అన్నారు.



రోడ్డెక్కిన వరద



కాకినాడ జిల్లా గొల్లప్రోలు టోల్ గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపైకి శుక్రవారం మధ్యాహ్నం ఏలేరు వరద నీరు చేరింది. ఏలేరు కాలువలకు గండ్లు పడటంతో పొలాల మీదుగా వచ్చి న వరద నీరు రోడ్డుపై నిలిచిపోయింది.



ర్యాలీ చేస్తున్న ఏసీబీ అధికారులు

లంచం అడిగితే.. మాకు ఫోన్ చేయండి

ఏసీబీ డీఎస్పీ కిశోర్ కుమార్

రాజమహేంద్రవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వోద్యోగులు లంచం అడిగితే వెంటనే తమకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని..ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు సమాచారం ఉన్నా తమకు తెలియజేసి అవినీతి రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని ఏసీబీ డీఎస్పీ కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఏసీబీ శాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు.అవినీతిపై టోల్‌ఫ్రీ నెంబరు 1064 లేదా 9440446160/61/63 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ డి.వాసుకృష్ణ, వై.సతీశ్,ఎస్‌ఐ విల్సన్‌బాబు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం (నేడు) ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. జిల్లాలో 2,35,031 మందికి రూ.103.17 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఏవైనా ఇబ్బంది ఏర్పడితే ఆందోళన చెందకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. పింఛన్ల పంపిణీకి 4975 మందిని నియమించామని చెప్పారు.

చివరికి.. దళారీ!



ధాన్యం విక్రయాలు

75 కేజీల బస్తా రూ.1300

- అన్నదాతను ముంచిన తుఫాన్
- ముందస్తుగా ధాన్యం కోతలు
- పచ్చిమీదే సాగుతున్న లావాదేవీలు
- బస్తాకు రూ.400 దళారీ నొక్కుడు
- లబోదిబోమంటూ అమ్మకాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోళ్లలో దళారీలు దగా చేస్తున్నారు. అన్నదాతలను నిలువునా దోచేస్తున్నారు. మొంథా తుఫాన్ దెబ్బకు విలవిల్లాడుతున్న రైతాంగాన్ని మరింత ముంచుతున్నారు. పచ్చి ధాన్యం పేరిట 75 కేజీల బస్తా ధాన్యాన్ని కేవలం రూ.1300లకే కొనుగోలు చేయడం గమనార్హం. వాస్తవానికి 75 కేజీల బస్తా రూ.1700 వరకూ కొనుగోలు చేయాలి. కానీ తడిచిందని.. పచ్చిగా ఉందనే కారణంతో దోచేస్తున్నారు. తీవ్రంగా నష్టపోయిన రైతాంగం దిక్కుతోచని స్థితిలో ధాన్యం అమ్ముకుంటూ కన్నీళ్లు పెడుతున్నారు. నరేంద్రపురం గ్రామానికి చెందిన గొర్లె ముసలయ్య, పాండవులు,బొర్రా చిన వీర్రాజు మాట్లాడుతూ సుమారు 35 ఎకరాల వరకూ కౌలు సాగు చేస్తున్నాం. ఇవాళ మొత్తం పంట పడిపోయింది..కోయడానికి కూడా వీలు లేకుండా పోయిందని వాపోయారు. బ్రోకర్లు పచ్చిధాన్యం అయినకాడకు కొంటున్నారని చెప్పారు. ఇక రాజానగరం,కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో వేల ఎకరాల పంట నీటిలో ఉంది. చాలా వరకూ పడిపోయింది. జిల్లాలో 76,941 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేసిన సంగతి తెలిసిందే.ఈ నెల 27వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ఆరంభ మయ్యాయి. కానీ తుఫాన్ దెబ్బతో రైతు సేవా కేంద్రాల సిబ్బంది అంతా పంటల నష్టం అం చనాలో నిమగ్నమయ్యారు.సందట్లో సడేమియా అన్నట్టు ధాన్యం కొనుగోలు బ్రోకర్లు ముందుకు వచ్చి పచ్చిధాన్యం అయినకాడకు కొంటున్నారు.



పచ్చిమీదే కోత

75 కేజీల బస్తా రూ.1720

గ్రేడ్ ఎ.రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1720 వరకూ కొనుగోలు చేయాలి. ప్రస్తుతం గ్రేడ్-ఎ సన్నరకం ధాన్యం కూడా రూ.1300లకే కొనడం గమనార్హం. నరేంద్రపురం రోడ్డు సమీపంలో ఓ మిల్లు వద్ద రోడ్డు మీద ఓ రైతు, తడిచిన ధాన్యం, పచ్చిధాన్యం వేర్వేరుగా పోగు చేసి కొనేవారికోసం ఎదురు చూడడం గమనార్హం..ఇప్పటి వరకూ 2651.72 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి.శుక్రవారం తెరపి వ్వడంతో చాలా మంది కోతలకు ఉపక్రమించారు.

75 కేజీల బస్తా రూ.1300లకే అమ్ముకుంటున్నా..

వెలుగుబంద రోడ్డులో 9 ఎకరాలు కౌలుకు చేస్తున్నా. కౌలు రూ.2 లక్షలు, పెట్టుబడి రూ.2 లక్షలు పెట్టా. తుఫాన్, భారీ వానల దెబ్బకు దిగుబడి ఎకరా 25 బస్తాలు వస్తుంది. ధాన్యం కొనేవాడులేక కేవలం 75 కేజీల బస్తా రూ.1300లకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఆరబోసుకునే పరిస్థితిలేక పచ్చి ధాన్యం అమ్మేశా. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

\- ఇండిగల రాంబాబు, కౌలు రైతు



పచ్చిమీదే కోత
కోసిన ధాన్యం



ర్యాలీ చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్, పోలీసులు.. కలెక్టరేట్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ, డీఆర్‌వో

ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్

150వ జయంతి కార్యక్రమంలో ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం/రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు పాటుబడిన ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ నర సింహ కిశోర్ కొనియాడారు. మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్ల భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా పోలీసులు 'రన్ ఫర్ యూనిటీ' పేరుతో ర్యాలీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ కిశోర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. లాలాచెరువు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన సిబ్బందితో ఎస్పీ ఐక్యత ప్రమాణం చేయించారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దూరదృష్టి, దేశభక్తి, దేశసేవపై స్ఫూర్తిని నిం పారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

సర్దార్ వల్లభబాయ్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీక అని..ఆయన దూరదృష్టి, ధైర్యం పట్టుదలతో 565 సంస్థానాలు భారత సమాఖ్యలో విలీనం చేసి దేశ సమగ్రతకు పునాదులు వేశారని జేసీ వై.మేఘస్వరూప్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.భారత దేశ తొలి ఉప ప్రధాని, స్వతంత్ర్య ఉద్యమనాయకుడు, గణతంత్ర సభ్యుల్లో ఒకరన్నారు. ఈ కార్యక్ర మంలో డీఆర్‌వో సీతారామమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలికలు | కొవ్వూరు ఎమ్మెల్యే గ్రీవెన్స్ 9 వినతులు 8



పెరవలి మండలం కానూరు వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, తదితరులు

ఆర్వోబీ పనులు వేగవంతం చేయండి

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్వోబీ పనుల్లో జాప్యం లేకుండా వేగవం తంగా పూర్తి చేయాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. నిడదవో లులో జరుగుతున్న ఆర్వోబీ పనులు, నిడద వోలు మండలం పెండ్యాలలో శుక్రవారం ఆకస్మి కంగా పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.184.74 కోట్ల నిధులతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరుగు తున్నాయని ఇప్పటికే 65 శాతం పనులు పూర్తయినట్టు అధికారులు తెలిపారన్నారు. నిడదవోలు నియోజకవర్గం సురక్షితంగా ఉండేందుకు ఏ విపత్తులు వచ్చినా తట్టుకునే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం చంద్రబాబుకు అందించామని త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందన్నారు. తుఫాన్ బాధిత ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి నిత్యావస రాలు అందించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంద న్నారు. ఎర్రకాలువ ఉప్పొంగినా తుఫాన్, భారీ వర్షాలు, వరదలు సంభవించినా నిడదవోలు నియోజకవర్గం సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి రూ. 290 కోట్ల అంచనాలతో ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించామన్నారు.ఆర్వోబీ సకాలంలో అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఆయన వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కూటమి నాయకులు, తుఫాన్ బాధితులు ఉన్నారు.

ముగిసిన నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో ఉచిత వైద్యసేవలు శనివారం నుంచి యథాతథంగా అందుబాటులోకి రానున్నాయి. బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ స్పెషాలిటీ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు గత కొన్ని రోజులుగా ఉచిత వైద్యసేవలు నిలిపివేసి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ ఉన్నతాధికారులతో నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించాయి. దీంతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులన్నింటిలోనూ వైద్యసేవలు అందుతాయని జిల్లా సమన్వయాధికారిణి డాక్టర్ పి.ప్రియాంక తెలిపారు. జిల్లాలో మొత్తం 45 ప్రైవేట్ ఆసుపత్రులు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో అర్హులకు ఉచిత వైద్యసేవలను అందిస్తున్నాయని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా.. రెండు లారీలు సీజ్



కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా ఇసుక రవాణాచేస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకుని పోలీసు కేసులు నమోదు చేసినట్టు మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో అక్టోబరు 30వ తేదీన ఇసుక ర్యాంపుల్లో టాస్క్‌ఫోర్సు సిబ్బంది ఆంజనేయులు,మైనింగ్ అధికారులు దాడు లు చేశారు. ఈ దాడుల్లో రెండు లారీలు సరైనపత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ వాహనాలు గతంలో ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా చేసిన కేసుల్లో పట్టుబడి జరిమానాలు చెల్లించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి వాహన యజమానులే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు గుర్తించడం జరిగింది. దీనిపై రెండు వాహనాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో జిల్లా గనులు మరియు భూగర్భ శాఖాధికారి డి.ఫణిభూషన్‌రెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్‌ఐ పి.విజయకుమార్ తెలిపారు.

ముంచేసిన బురద కాల్వ



నీట మునిగిన వరిచేలు

- ముంపులోనే వేలాది ఎకరాలు
- నీట మునిగిన శ్రీరంగపట్నం
- తగ్గిన వరద ఉధృతి..
- కోలుకుంటున్న రైతాంగం

శ్రీరంగపట్నంలో రోడ్డుకు సమాంతరంగా కాలువ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

బురదకాలువ దుఃఖదాయినిగా మారింది. పట్టించుకునే నాథుడే కనిపించకపోవడంతో ప్రతి ఏటా వేలాది ఎకరాల పంట నష్టపోవడంతో పాటు శ్రీరంగపట్నం వంటి గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. గతంలో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా అవి ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. కాలువలో పూడిక తీయకపోవడంతో గురువారం వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి.ఏజెన్సీలోని గంగవరం మండలం పరిధిలోని సూరంపాలెం ప్రాజెక్టు నుంచి బురద కాలువకు వరద వస్తుంది. సూరంపాలెం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి వచ్చే నీటికి నెల్లిపూడి వాగు తోడ వ్వడంతో ఇది బురద కాలువగా అవతరించింది. అక్కడ నుంచి కోరుకొండ మండలం శ్రీరంగపట్నం వరకూ 24 కిలోమీటర్ల మేర ఇది ప్రవహిస్తోంది. కోరుకొండలో 510 హెక్టార్లు, గోకవరంలో 1215 హెక్టార్లు, సీతానగరంలో 1105 హెక్టార్ల పంట నీట మునిగింది. ఊళ్లను, పొలాలను ముంచేస్తుంది. గతంలో ఈ నీరు పంట పొలాలకు ఉపయోగపడేది. దీనికి అనుసంధానంగా 30 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి.ఒక చెరువు నిండి.. అక్కడ మరో చెరువుకు రావడం ద్వారా ఇలా 30 చెరువుల చైన్ లింక్ ఉంది.ప్రస్తుతం చెరువులు ఆక్రమణకు గురికావడం సమస్యగా మారింది. పైగా కాలువ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోరు. ఇది శ్రీరంగపట్నం ఊరికి సుమారు 2 కిలోమీటర్ల లోపు నాలుగు కాలువలుగా మారిపోతుంది. శ్రీరంగపట్నంలో రెండు కాలువలు ఊరి మధ్య నుంచి ఉగ్రరూపంతో ప్రవహిస్తుండంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ప్రతీ ఏటా ఊరంతా మునిగిపోయి.. వారం పది రోజుల వరకూ నీరు లాగేది కాదు. ఈ సారి ఎగువభాగం రాఘవాపురం సమీపంలో గండ్లు పడడం వల్ల కొంత వరద తగ్గింది.అయినా వడి తగ్గలేదు.పైగా ఈసారి ప్రభుత్వ అధికారులు రెండు కాల్వల గట్లు మీద కొన్ని ఇసుక బస్తాలు పేర్చడంతో కొన్ని వీధుల్లోకి నీళ్ల రాలేదు. ప్రస్తుతం కొత్తకాలువ ప్రభావంతో కాయలవీధి, ఇతర వీధుల్లో నీరు ఉంది.ఊరిలో మురికి దిగే పరిస్థితి లేక డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి.ఇక్కడ అనేక ఇటుక బట్టీలు, పని వారి కోసం నిర్మించిన షెడ్లలోకి నీరెళ్లిపోయింది. ఆళ్లరాము, మళ్లా నరసింహం ఇంటి ఆవరణలో ఇంకా వరద నీరు ఉంది.రెండు రోజుల కిందట బురదకాలువ గుండా 2500 క్యూసెక్కుల వరద ప్రవహించగా, ప్రస్తుతం 1000 క్యూసెక్కుల వరద ప్రవహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



కోరుకొండ మండలంలో నీట మునిగిన శ్రీరంగపట్నం రోడ్

'నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి'


తుఫాన్‌కు నేలకొరిగిన వరి పంట

కొవ్వూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో కొవ్వూరు డివిజన్‌లో అన్నదాతలకు తీరని నష్టం కలిగిందని రైతు సంఘం నాయకుడు కేవీకే రంగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని, పాక్షికంగా నష్టపోయిన రైతులనూ ఆదుకోవాలన్నారు. ప్రధానంగా వరి, అరటి, బొప్పాయి, కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయన్నారు. వరిలో స్వర్ణ, సంపత స్వర్ణ , 1318 రకాలు నేలకొరిగాయన్నారు. ఇవి మరో 20 రోజుల్లో కోతకు రావాల్సి ఉందన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి


వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

కొవ్వూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేయుటలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ అన్నారు. శుక్రవారం అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఉక్కు మనిషి 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్, వై.రవీంద్ర, సీహెచ్ దయాకర్, డీ.రామలింగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సునీత ఆధ్వర్యంలో వలబాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. వి.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, మదర్‌సాహెబ్, పుష్పాంజలి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయం

● పశివేదల సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు


శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న రామచంద్రరావు

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పశివేదల ది.రంగారాయ విశాల పరపతి సంఘం అభివృద్ధికి కరుటూరి శ్రీనివాసరావు అందించిన సేవలు అభినందనీయమని ఆ సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు అన్నారు. పశివేదల సొసైటీ సీఈవో కరుటూరి శ్రీనివాసరావు పదవీ విరమణ అభినందన సభ శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులను శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా పశివేదల పీఏసీఎస్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సీఈవో హోదాలో రిటైర్డ్ అవ్వడం గర్వకారణమన్నారు. రైతులు శ్రీనివాసరావును మరలా కొనసాగించాలని కోరడం అతని పనితనానికి నిదర్శనమన్నారు. సహకార సంఘాల సిబ్బంది శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గారపాటి శ్రీనివాసరావు, బేతిన నారాయణ, రాయపాటి సుబ్బారావు, యలమాటి మోహనరావు, పరిమి సోమరాజు, ఉప్పులూరి సూరిబాబు, వేగి వీర్రాజు, సూదిన శ్రీనివాస్, గ్రామస్తులు, సహకార సంఘాల ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దూబచర్లలో కార్తీక వన సమారాధన

నల్లజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దూబచర్లలో శుక్రవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. దీనికి దూబచర్ల ఉప సర్పంచ్, అభయాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త కాసాని బాలగంగాధర్ (బాటయ్య) అధ్యక్షత వహించారు. కాలినడకన ద్వారకా తిరుమల వెళ్లే భక్తులతోపాటు గ్రామస్థులకు భోజనాలు పెట్టారు. ప్రతి ఏటా వెయ్యి మంది భక్తులకు వన భోజనాలు ఏర్పాటు చేస్తామని, అలాగే పాదయాత్రగా వెళ్లే భక్తులకు కూడా గుడి వద్ద బసతోపాటు, తాగునీరు అందిస్తామని నిర్వాహకుడు బాటయ్య పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● మంత్రి కందుల దుర్గేష్


కానూరు వద్ద దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ధాటికి దెబ్బతిన్న రోడ్లను బాగు చేస్తామని, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానూరు - ఉసులుమర్రు రోడ్డు బాగా దెబ్బతిందన్నారు. దీంతో స్థానిక ప్రజానీకం కోరిక మేరకు రూ. 3 కోట్లతో సిమెంట్ రోడ్డుగా చేయడానికి నిర్ణయించామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అనుమతులు పొందడంతో నిధులు మంజూరయ్యాయని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. అలాగే రూ. 3 కోట్ల 24 లక్షలతో తీపర్రు - వట్లూరు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. కాల్దరి రోడ్డుకు రూ. 60 లక్షలు, కానూరు - లంకల కోడేరుకు రూ. 4 లక్షల 20 వేలు మంజూరైనట్టు చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో మాట్లాడి రూ. 8 కోట్ల 30 లక్షల విలువైన రోడ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. రూ. 4 లక్షల 15 కోట్లతో దువ్వ - తేతలి - మునిపల్లి రోడ్డు నిర్మించనున్నామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా డిప్యూటీసీఎం పవన్ చొరవతో రూ. 11 కోట్లతో గ్రామాల్లో అంతర్గత రోడ్లు బాగు చేశామని, ఇటీవల మరో రూ. 5 కోట్లు మంజూరు చేయించామన్నారు. మరో నెల రోజులుగా పుంతరోడ్లు, డ్రెయిన్లు బాగు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో వాకలపూడి వీర్రాజు, ముళ్లపూడి రాజు, రంకిరెడ్డి ప్రసాద్, కోలా సీతయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టాలపై అధ్యయనం చేయాలి : ఎమ్మెల్యే


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునే విధంగా నష్టాలను అధ్యయనం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానశాఖ, హౌసింగ్, మత్స్యశాఖల అధికారులతో తుఫాన్ నష్టాలపై రివ్యూ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టాలపై త్వరగా అధ్యయనం చేసి రైతులను ఆదుకునే విధంగా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కొవ్వూరులో ప్రాథమికంగా 1050 ఎకరాలలో వరి, 25 ఎకరాలలో మినుము, డివిజన్ పరిధిలో ఉద్యాన పంటలు 760 ఎకరాలలో నష్టం వాటిల్లిందన్నారు. అలాగే 730 ఎకరాలలో అరటి, 30 ఎకరాల్లో బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రతి మండలానికి ఒక ఉద్యానశాఖ అధికారిణి నియమించాలని జిల్లా అధికారిని ఆదేశించారు. చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 1600 మంది మత్స్యకారులను ఆదుకోవాలన్నారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డసుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, ఉప్పులూరి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

58 బాధిత కుటుంబాలకు సరుకులు

తుఫాన్ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణం, మండలంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలైన బ్రిడ్జిపేట, మద్దూరులంక పల్లిపాలెంకు చెందిన 58 బాధిత కుటుంబాలకు శుక్రవారం తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వ ర్యంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే, ఆర్డీవో రాణీసుస్మిత హాజరయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ పట్టణంలోని పండిత మదన మోహన మాలవ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పునరావసం పొందిన 38 కుటుంబాలకు, మద్దూరు జడ్పీ హైస్కూల్లో పునరావాసం పొందిన మద్దూరులంక పల్లిపాలెంలోని 15 కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు, కేజీ పామాయిల్, కేజీ పంచదార, కేజీ కందిపప్పు అందజేశామన్నారు. అనంతరం ఆరికిరేవులలో వర్షాలకు పడిపోయిన ఇంటిని పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్న, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, అక్షయపాత్ర రవీంద్ర, నాయకులు బేతిన నారాయణ, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, జెట్టి బంగారయ్య, సొసైటీ ప్రెసిడెంట్ సుంకర సత్తిబాబు, బోడపాటి ముత్యాలరావు, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు. అలాగే ఆరికిరేవులకి మారిశెట్టి సత్యనారాయణకు చెం దిన ఇల్లు పడిపోయింది. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే ముప్పిడి నాయకులతో కలిసి వెళ్లి పడిపోయిన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి యాజమానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయిన వాకలపూడి వెంకటేశ్వరరావుకు రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, యనమదల శివరామకృష్ణ ప్రసాద్, సూరపనేని చిన్ని, వట్టికూటి వెంకటేశ్వరరావు, గొరిజాల సురేష్, గుత్తా రమణ, వరిగేటి కాంతరాజు, ఎంపీటీసీ అల్లు అమరావతి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చన్నపాలెంలో సరుకుల పంపిణీ

నల్లజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు ప్రభుత్వం నిత్యవసర సరుకులు పంపిణీ చేసింది. శుక్రవారం అచ్చన్నపాలెంలో 62 మందికి గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, తహశీల్దార్ వీఎస్‌వీ నాయుడు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు అందించారు. నల్లజర్ల సొసైటీ చైర్మన్ రావూరి వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, చీపురుగూడెం టీడీపీ అధ్యక్షులు చెల్లు పెద్దరామన్న, నల్లజర్ల అధ్యక్షులు బేతిన దుర్గారావు, ఏవో సోమశేఖర్, తహశీల్దార్ నాయుడు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వీఆర్వో చంద్రబాబు, తదితరులున్నారు.

పాలంగిలో సివిల్ రైట్స్ డే

ఉండ్రాజవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో శుక్రవారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ పీఎన్‌డీప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరూ కలసిమెలసి జీవించాలన్నారు. ప్రభుత్వం కల్పించే సంక్షేమం, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, రీసర్వే డీటీ ప్రసాద్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి కే. వెంకట ప్రసాద్, వీఆర్వో ఎస్. అప్పారావు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు


వేగేశ్వరపురంలో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లపూడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురంలో వేంచేసియున్న అలివేలు మంగసమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప దీక్షా మాలధారుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు పెరవలి సత్యప్రసాద్, సాయి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. తర్వాత ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, స్వాములు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు తొమ్మిది ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి తొమ్మిది ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, బేతిన నారాయణ, కలగర సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యజ్ఞవల్క జయంతి

నిడదవోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన కాశీరేవులో వేంచేసివున్న శ్రీ సూర్య యజ్ఞవల్క ఆంజనేయ మందిరంలో శుక్రవారం యజ్ఞవల్క మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి రుద్రాభిషేకం, సూర్య నమస్కారాలు, తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం ఘనాపాటిలైన లింగాల సత్యనారాయణ అవధాని, భాగవతుల హనుమంతు ఘనాపాటి, అనిపెద్ది వెంకట రామ గణపతి, తదితరులను పొన్నా కృష్ణబాబు శర్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

కొవ్వాడ కాల్వకు నీటి ఉధృతి

గోపాలపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఎగువ ప్రాంతంలో కురిసిన వరద నీరు మూడోరోజు శుక్రవారానికి మండలంలోకి ప్రవేశించింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటితో చిట్యాల, వెంకటాయపాలెం రెవిన్యూపరిధిలో వరిచేలు నీటమునిగాయి. అయితే ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న నీరు దిగువ ప్రాంతానికి వేగంగా ప్రవహించటంతో పంటకు ఎటువంటి నష్టంఉండదని రైతులు భావిస్తున్నారు.

ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం

నిడదవోలు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఏఐటీయూసి దేశంలోనే ప్రప్రథమ కార్మిక సంస్థ అని ఆ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ నేత రేఖా భాస్కరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా భాస్కరరావు వెంకటేశ్వర జట్టు యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాముడూరి నాగేంద్ర వరప్రసాద్, మొయిలి శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, బేజా అప్పారావు, కోసూరి శ్రీను, మామిడి సన్యాసిరావు, రొంగల శ్రీను, పెంటపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మైనర్ బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

కొవ్వూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మైనర్ బాలికలను 24 గంటల్లో వెతికి కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. వాడపల్లిలో నివసిస్తున్న మైనర్ బాలికలైన అవల కీర్తి, అవల నవ్య అక్టోబరు 30న ఉదయం 10 గంటలకు పూసలు అమ్ముకోవడానికి అని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి ఆటోలో బయటకు వచ్చారు. తిరి గి ఇంటికి రాకపోవడంతో తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు న మో దు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికలు ఎక్కిన ఆటోడ్రైవర్‌ను విచారించగా బాలికలు ఆటోడ్రైవర్ ఫోన్ నుంచి గతంలో వాడపల్లిలో తమ ఇంటిపక్కనే నివాసం ఉన్నవారికి జంగారెడ్డిగూడెం ఫోన్ చేశారని తెలిపాడు. పోలీసులు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికలను తీసుకొచ్చి తహశీల్దార్ స్టేట్‌మెంటు తీసుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. తల్లి మందలించడంతో బాలికలు జంగారెడ్డిగూడెం వెళ్లినట్టు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు చిట్యాల విద్యార్థులు


అండర్ - 14 పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గోపాలపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఉన్నతస్థాయికి చేరుస్తాయని చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వైఎస్ఎన్ మూర్తి అన్నారు. ఇటీవల కొవూర్పులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో హైస్కూల్‌కు చెందిన 9వ తగరతి విద్యార్థి ధనూష్, 8వ తరగతి విద్యార్థి ఆర్యా ఆనంద్ పాల్గొని ఎంతో ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను, సీఆర్‌సీ కొయ్య నాగరాజు అభినందించారు. కాగా, ఈ నెలలో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారంతా పాల్గొంటారని చెప్పారు.

జిల్లా అండర్ - 14,17 బాల బాలికలకు సెపక్‌తక్రా పోటీలు


సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో రవీంద్రనాథ్

దేవరపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ - 14,17 బాల బాలికలకు సెపక్‌తక్రా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ సెపక్‌తక్రా పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఎంపికైన క్రీడాకారులు (అండర్-14) నవంబర్ 2,3 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే పోటీల్లో పాల్గొంటారని, అలాగే అండర్ - 17 క్రీడాకారులు నవంబర్ 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో దుద్దుకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వెంకట్రావు, పీఈటీ నాగరాజు, పలువురు పీఈటీలు, ఎంఈవో తిరుమలదాసు, హెచ్‌ఎం బీవీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి


ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బచ్చు బుజ్జిబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాకా పుల్లారావు, పట్టణ ఉపాధ్యక్షుడు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పైడిమెట్ట మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏకైక కుమార్తె అని, ఆమె మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా పనిచేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఆమె జీవిత చరిత్ర గురించి తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండలంలో 4,750 ఎకరాల్లో వరిపంటకు నష్టం


వేలివెన్నులో వరిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

ఉండ్రాజవరం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 4,750 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు వ్యవసాయశాఖ కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం వేలివెన్నులో తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పంటను ఆయన పరిశీలించి మాట్లాడుతూ పంట నష్ట అంచనాను త్వరితగతిని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే నష్టపోయిన రైతుల జాబితాలను త్వరగా పూర్తిచేసి జిల్లా అధికారులకు అందజేయాలని సూచించారు. మండలంలో 225 ఎకరాల్లో అరటి పంటకు నష్టం జరిగిందన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత తెగుళ్ల వచ్చే అవకాశం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు ఏడీఏ శ్రీనివాస్ సూచించారు. మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు గోనెసంచులు అందుబాటులో ఉంచామన్నారు.రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవో బీ. రాజారావు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్ రామలక్ష్మి సేవలు అభినందనీయం


పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు రామలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

చాగల్లు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీపీ (వీవీఎస్ సుగర్స్) స్కూల్లో టీచర్‌గా పనిచేసిన వడ్లమూడి రామలక్ష్మి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో డీవైఈవో రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం చేస్తున్న కృషికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు, బంధుమిత్రులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 సుధాకర్, యూటీఎఫ్ నాయకులు పిల్లి శ్రీనివాసమూర్తి, బీ. రవికుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

● ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు


నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు

నల్లజర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అన్నారు. శుక్రవారం నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేం ద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కల్పించిం దని, రైతులు దళారులను నమ్మవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లాభం పొందాలన్నారు. అలాగే ధాన్యం సొమ్ములు సైతం రైతు ఖాతాల్లో కేవలం 24 గంటల్లోనే వేస్తారన్నారు. ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ చైర్మన్ రావూరి వెంకట రమణ, నల్లజర్ల మండల టీడీపీ అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, చీపురుగూడెం టీడీపీ అధ్యక్షులు చెల్లు పెద్దరామన్న, నల్లజర్ల అధ్యక్షులు బేతిన దుర్గారావు, ఏవో సోమశేఖర్, తహశీల్దార్ నాయుడు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వీఆర్వో చంద్రబాబు, వీఆర్ఏ సర్దార్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


మీనానగరం పునరావాస కేంద్రంలో పంపిణీ చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ హరిబాబు, తదితరులు

చాగల్లు, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): చాగల్లు శివారు మీనానగరం ఎంపీపీ స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో తలదాచుకున్న వారికి శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంచార జాతులకు చెందిన 19 కుటుంబాల వారికి 25 కేజీల బియ్యంతో సహా ఇతర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముందు జాగ్రత్త చర్యలు వల్ల తుఫాన్ నష్టం తగ్గిందన్నారు. పంట నష్టపోయిన రైతులు సహా అన్నివర్గాల ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. మెరికమ్మ, మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, టీడీపీ నేతలు దొంగ రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు, బీజేపీ నేత గ్రంధి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి సొసైటీ వద్ద ...

దేవరపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నిర్వాసితులకు ప్రభుత్వం నెలరోజులకు సరిపడా బియ్యం, పంచదార, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్ అందజేయడం జరిగిందని తహశీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. దేవరపల్లి సొసైటీ వద్ద శుక్రవారం దేవరపల్లి, బంధపురం, గౌరీపట్నం, యాదవోలు గ్రామాలకు చెందిన తుఫాన్ బాధితులు 65 మందికి బియ్యం, ఇతర వస్తువులను అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కమల్, వీఆర్వో లక్ష్మి, సొసైటీ సభ్యులు కవల సీతారత్నసూర్యకుమారి, టీడీపీ నాయకులు కొండపల్లి దొరయ్య, పిన్నమని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

యానాం నుంచి బీర్లు రవాణా ... ఇద్దరిపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : యానాంలో 24 టిన్ బీర్లను కొనుగోలు చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన దాసరి పృథ్వీ వెంకటసాయి నితీష్, గడుసుకోట భాను ప్రకాష్ అక్టోబరు 29న యానాంలో 24 టిన్ బడ్వయిజర్ బీర్లను కొనుగోలు చేసి కారులో నిడదవోలు తీసుకువస్తుండగా మద్దూరులంక బ్యారేజ్‌పై మోటారుసైకిల్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో గ్యాస్ ఏజెన్సీ ఆటోడ్రైవర్ చాగల్లు మండలం ధారవరానికి చెందిన షేక్ ఖాదర్ కాజా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కారును మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేస్తుండగా కారు డిక్కీలో 24 బడ్వయిజర్ బీర్లు కనిపించాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని నితీష్, భానుప్రకాష్‌పై కేసు నమోదు చేశారు.